సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



కువైటీ వేధింపుల నుంచి విముక్తి

కువైట్‌లో సేఠ్ వేధింపులకు గురవుతున్న మదనపల్లికి చెందిన షేక్ మహబూబ్ జాన్‌కు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు విముక్తి కల్పించారు. -8లో..



దూసుకొచ్చిన మృత్యువు

పులివెందులలోని భాకరాపురం రోడ్డు సమీపంలో బైక్, స్కార్పియో ఢీకొన్న సంఘటనలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. కుమారునికి గాయాలయ్యాయి. -8లో..

గరిష్టం/కనిష్టం
35.2/25.5

వాతావరణం

జిల్లాలో గురువారం 25.5 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పరీక్ష రుసుము చెల్లింపునకు సెప్టెంబర్ 15 తుది గడువు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష అనుత్తీర్ణులైన విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరం మార్చి నెలలో పరీక్ష రాసేందుకు సెప్టెంబర్ 15వ తేదీలోగా రుసుము చెల్లించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, హెచ్ఎంలు విద్యార్థులకు సూచించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు సబ్జెక్టులకంటే తక్కువ అనుత్తీర్ణులైనవారు రూ.110, మూడు కంటే ఎక్కువ ఉంటే రూ.125 రుసుము చెల్లించాలన్నారు. గడువు దాటితే సెప్టెంబర్ 30వ తేదీ వరకు రూ.50 ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలని తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆల కళ్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవమూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను సుగంధద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకించారు. నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి, తులసీ గజమాలతో అలంకరించారు. సతీసమేతుడైన కోదండరామ స్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

1435 మంది రైతులకు రూ.2 కోట్ల పరిహారం

కడప అగ్రికల్చర్: అధిక వర్షాలతో ఈ ఏడాది మే, జూన్ నెలల్లో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన వారి ఖాతాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి పంట నష్టపరిహారం నేడు జమ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1435 మంది రైతులు 817.38 హెక్టార్లలో పంట నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ నష్ట పరిహారంగా రూ. 2,02,65,375లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని విడుదల చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. 11 అంగన్వాడీ వర్కర్లు, 72 సహాయకురాళ్లు 72, ఇద్దరు మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులైన వారు సెప్టెంబరు 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 13న ఉదయం 11 గంటలకు సంబంధిత ఆర్డీఓ కార్యాలయంలో మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు https://kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

5న బద్వేల్‌లో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు సెప్టెంబరు 5న బద్వేలులోని ఎస్ఆర్ఎస్‌బీ పీజీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. 15 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హులను ఎంపిక చేస్తారన్నారు. 18-30 సంవత్సరాల వయస్సు కలిగి పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www. apss dc.in లింక్‌లో తమ పేర్లు రిజిష్టర్ చేసు కోవాలన్నారు. వివరాలకు 63001 25455, 90 63623706 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డైరెక్టర్ జె.మురళి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ ఉద్యోగులు ధ్యానం చేసుకుని ఒత్తిడికి దూరం కావచ్చునని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ డైరెక్టర్ జె.మురళి అన్నారు. జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కోపం, భయం ఉంటే శక్తిని కోల్పోతారన్నారు. డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

- నేటి నుంచి ప్రారంభం
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు



కడపలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రిజిస్ట్రేషన్లశాఖ డిజిటలైజేషన్ వైపు పరుగులు పెడుతోంది. ఇందులో భాగంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. వేగంతో కూడిన సేవలు అందించడంతోపాటు ఆస్తుల బదలాయింపులో అక్రమాలకు తావు లేకుండా కచ్చితంగా ఉండేవిధంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను రిజిస్ట్రేషన్‌శాఖ అనుసంధానం చేస్తోంది.

కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్‌శాఖ కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు (కార్డు) సాఫ్ట్‌వేర్‌ను మరింత ఆధునీకీకరించి కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రూపొందించింది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా స్థిరాస్తుల లావాదేవీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయనుంది. దీంతో క్రయ విక్రయదారులకు సమయం వృథా కాకుండా నిమిషాల వ్యవధిలోనే వేగవంతంగా సేవలు అందనున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ ప్రత్యేకత ఏమిటంటే డాక్యుమెంట్లు కొనుగోలు చేయాల్సిన పని ఉండదు. దస్తావేజులను పూరించాల్సిన అవసరం అంతకన్నా ఉండదు. ఒక రకంగా చెప్పాలంటే మీ డాక్యుమెంట్లను మీరే ఆన్‌లైన్‌లో పూరించి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్‌లో సూచించిన సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అలాగే ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ఫీజు, చలానా సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్థిరాస్తుల క్రమ విక్రయదారులకు ప్రత్యేకంగా ఓటీపీలు వస్తాయి. అధికారులకు సమాచారం చెబితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి డాక్యుమెంట్లు ప్రింట్‌తోపాటు కొనుగోలుదారులు, అమ్మకందారుల మెయిల్‌కు వస్తాయి.

నేటి నుంచి అమలులోకి..

కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిష్టర్ కార్యాలయాల్లో అమలులోకి రానుంది. వైఎస్సార్ జిల్లాలో 12, అన్నమయ్య జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇప్పటికే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా రిజిస్ట్రార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం తమకు కన్వీనియంట్ టైమ్‌లో స్లాట్ బుక్‌చేసుకుని కేవలం 20 నిమిషాల సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఈ విధానాన్ని వినియోగదారులు విరివిగా వినియోగించుకుని మధ్యవర్తులపై ఆధారపడకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరంగా పూర్తి చేసుకోవచ్చు.

అవగాహన కల్పించాం



స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వినియోగదారులకు మరింతగా చేరువ చేసేందుకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు కార్డు సాఫ్ట్‌వేర్‌ను ఆధునికరించి ప్రైమ్ 2.0ను రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానం క్రయ విక్రయదారులకు సులభంగా ఉంటుంది. అవకతవకలు జరగవు. అలాగే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఈ నూతన విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – శివరాం, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

▶▶ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రానున్న కార్యాలయాలు

వైఎస్సార్ జిల్లాలో..
కడప ఎస్ఆర్ఓ జాయింట్-1, 2, కడప రూరల్, బద్వేలు, సిద్ధవటం, దువ్వూరు, జమ్మలమడుగు, కమలాపురం, ముద్దనూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు ఎస్ఆర్ఓ జాయింట్-1, 2, పులివెందుల, వేంపల్లె, కడపలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం.

అన్నమయ్య జిల్లాలో..
చిట్వేలి, లక్కిరెడ్డిపల్లె, పుల్లంపేట, రాజంపేట, రాయచోటి, టి.సుండుపల్లె, పీలేరు, వాయల్పాడు, కలికిరి, మదనపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, రాయచోటి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం.

40 ఏళ్ల చెంచుల సమస్యకు పరిష్కారం

సర్టిఫికెట్లు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం అంజద్ బాషా



చెంచులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: నలభై ఏళ్లుగా కుల ధ్రువీకరణ పత్రాలు లేక చదువు, సంక్షేమ పథకాలకు దూరమైన చెంచులకు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా ఊరట కలిగించారు. చెంచు కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు సమస్యను డిప్యూటీ సీఎంకు చెప్పడంతో ఆయన వెంటనే తహసీల్దారు శివరామిరెడ్డికి ఆదేశాలిచ్చి గురువారం నాటి కార్యక్రమంలో కులధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో చెంచులు డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించారు. అంజద్ బాషా మాట్లాడుతూ 48వ డివిజన్ చెంచుకాలనీలో నివసిస్తున్న వారంతా కులధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారన్నారు. అనంతరం ఆయన ఇంటింటా పర్యటించి ప్రజలకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అఫ్జల్ ఖాన్, బంగారు నాగయ్య, పస్తం అంజి, తోట క్రిష్ణ, ఎస్.సుబ్బారెడ్డి, షఫీ, మధు, కె.కొండయ్య, రామ్మోహన్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, బండిమరియలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల బలోపేతం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్‌పాండే

మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్ పాండే

కడప అగ్రికల్చర్: మార్కెట్ కమిటీలను బలోపేతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ రాహుల్‌పాండే సూచించారు. కడప కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రాయలసీమ పరిధి లోని ఎనిమిది జిల్లాల ఏడీలు, మార్కెట్ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ రుసుము పెంచాలన్నారు. మార్కెట్ యార్డు పరిధిలో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలను మార్కెట్ యార్డుకు తెచ్చి అమ్ముకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలువురి కార్యదర్శుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డితోపాటు 8 జిల్లా ఏడీలు, మార్కెట్ యార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యాన అధికారులతో సమీక్ష

చీనీ పండ్లు సూట్ లేకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమీషనర్ రాహుల్‌పాండే సూచించారు. కడప ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో మార్కెటింగ్, ఉద్యానశాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల, వేంపల్లి, వేముల, సింహాద్రిపురం ప్రాంతాల్లో రైతులు పండించిన చీనీ కాయల కొనుగోలు విషయంలో వ్యాపారులు సూట్ కింద కొంత తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కష్టపడి పండించిన పంట దిగుబడులను అదనంగా ఎందుకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి మైఖేల్‌రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు!

తిరుపతి వరకే పరిమితం



తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు

రాజంపేట: ముద్దనూరు-మంగపట్నం మధ్య ట్రాఫిక్‌ను బ్లాక్ చేయనున్నారు. బ్రిడ్జి వద్ద పనులు చేస్తున్న క్రమంలో ఆ తేదీల్లో నడిచే రైళ్లను దారిమళ్లింపు, రద్దు లాంటి చర్యలను రైల్వేశాఖ చేపట్టింది. ఈనేపథ్యంలో విశాఖ-తిరుపతి-కడప మధ్య నడిచే తిరుమల(17488)ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 4, 5, 9తేదీల్లో రద్దు చేశారు. 17487 కడప నుంచి విశాఖ మధ్య నడిచే రైలును ఈ నెల 5, 6, 10న రద్దు చేశారు. ఫలితంగా తిరుమలను తిరుపతి వరకు పరిమితం చేశారు. కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ముద్దనూరు-మంగపట్నం మధ్య బ్లాకింగ్ ఇచ్చిన క్రమంలో తిరుమల కొండాపురానికి నీటి కోసం వెళ్లలేని పరిస్థితి. కడప వరకైనా నడిపించకుండా కేవలం కొండాపురం వెళ్లేందుకు మార్గం లేకనే తిరుమల రద్దు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఉభయ వైఎస్సార్ జిల్లా ప్రయాణీకులు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

నందలూరు వాటరింగ్ పెట్టి ఉంటే..

ముంబై-చెన్నై రైలుమార్గంలో ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో వాటరింగ్‌కు అనుకూలమని జోన్, డివిజన్ స్థాయి ఉన్నతాధికారులకు తెలుసు. నందలూరు రైల్వే కేంద్రం నుంచి కడప రైలు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అయ్యేది. డివిజన్ కేంద్రానికి నందలూరు నీళ్లను రైల్వే ఉన్నతాధికారులు తెప్పించుకునేవారు. వాటరింగ్ ఉంటే తిరుమల లాంటి రైళ్ల రద్దు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉండవు కదా అని రైల్వేవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికైనా జోనల్ అధికారులు నందలూరు నీటి వనరులను పరిగణనలోనికి తీసుకొని అన్ని రైళ్లకు వాటరింగ్ ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు.

హబ్లీ ప్యాసింజర్ రద్దు..

తిరుపతి-హబ్లీ (07657) మధ్య తిరిగే ప్యాసింజర్ రైలును కూడా ఈ నెల 4, 5, 9 తేదీల్లో రద్దు చేశారు. హబ్లీ-తిరుపతి(07658) మధ్య నడిచే రైలును ఈనెల 5, 6, 10ను రద్దు చేశారు. పలురైళ్లను 17215, 00761 రైళ్లను దారిమళ్లించారు.12789, 22157 నంబర్ల గల రైళ్లను రీషెడ్యూలు చేసి నడిపిస్తున్నారు.

విద్యార్థులకు కలెక్టర్ క్రమశిక్షణ పాఠాలు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

ఎర్రగుంట్ల: విద్యార్థి దశలో ఎలా ఉండాలి? క్రమశిక్షణతో ఎలా మెలగాలి? అంశాలపై కలెక్టర్ విజయరామరాజు విద్యార్థులకు పాఠాలు చెప్పారు. పలు ప్రశ్నలు సంధిస్తూ సమాధానాలు రాబట్టారు. గంటకు పైగా మాట్లాడి వారి మనోభావాలు తెలుసుకున్నారు. ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9, 10వ తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. అనంతరం ప్రతి విద్యార్థితో మాట్లాడి వారి లక్ష్యం తెలుసుకున్నారు. వెనుకబడి ఉన్నవారిపై చొరవ చూపాలని ఉపాధ్యాయుడికి సూచనలు చేశారు. అదే పాఠశాలలో 'నాడు-నేడు' పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దారు నాగేశ్వరరావు, ఎంపిడీఓ భాగ్యలక్ష్మీ, కమిషనర్ పి.జగన్నాథ్, హెచ్ఎం రామాంజనేయరెడ్డి, ఎంఈఓలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం: కమలాపురంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. తహసీల్దారు కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై తహసీల్దారు సరస్వతిని ఆరా తీశారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి ఓపీ, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. పట్టణంలో జరుగుతున్న ఆస్పత్రి అభివృద్ధి పనులను పరిశీలించారు. జడ్పీ బాలుర పాఠవాలను సందర్శించి కొత్త భవనాల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. ఆర్‌డీఓ ధర్మ చంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో

వల్లూరు: ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కడప ఆర్డీవో ధర్మ చంద్రారెడ్డితో కలిసి వల్లూరు తహశీల్దారు కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లను పరిశీలించారు. ఆధార్ సీడింగ్ పెండింగ్ వర్క్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహశీల్దారు శంకర్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుకు ఆర్థిక భరోసా

- నేడు జిల్లావ్యాప్తంగా 1792 మందికి నగదు జమ
- 2023-24కు జిల్లాలో 7035 మందికి సీసీఆర్‌సీ కార్డులు మంజూరు



కౌలు రైతు సాగు చేసిన మినుముపంట

కడప అగ్రికల్చర్: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. సాధారణ రైతులతోపాటు కౌలు రైతులకు పంటలసాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో కౌలు రైతు దశ, దిశ మారుతోంది. గతంలో భూ యజమాని అనుమతిస్తే తప్ప వీరికి ఎలాంటి ప్రభుత్వ రాయితీలు వచ్చేవి కావు. అంతేకాకుండా వారు పండించిన పంటలను కూడా కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించుకోలేని పరిస్థితి ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కౌలు రైతులను అందుకుంటోంది. భూ యజమాని హక్కులకు ఎలాంటి భంగం కలిగించకుండా పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు అన్ని రాయితీలు వర్తించేలా పంట సాగు హక్కు పత్రాలను(సీసీఆర్‌సీ) అందచేస్తోంది. దీంతో వ్యవసాయశాఖ ద్వారా వచ్చే అన్ని రాయితీలు వారు నేరుగా పొందుతున్నారు.దీంతో కౌలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీలకు 1792 మంది కౌలు రైతుల ఖాతాల్లో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 132.52 లక్షలు(1,32,52,500)జమ చేయనున్నారు. ఒక్కో కౌలు రైతుకు రూ. 7500 వంతున ఆర్థిక సాయం అందనుంది. దీంతో వారిలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

జిల్లాలో 7 వేల మందికి సీసీఆర్‌సీ కార్డులు

జిల్లాలోని 36 మండలాల్లో ఉన్న 432 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 7035 మంది కౌలు రైతులు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. వీరందరికి అధికారులు క్రాపు కల్టివేటర్ రైట్స్ కార్డు(సీసీఆర్‌సీ)లు పంపిణీ చేపట్టారు. ఇప్పటి వరకు అన్ని మండలాల పరిధిలో 7 వేల మందికి కార్డులను పంపిణీ చేశారు. మిగతా వారికి కూడా త్వరలో పంపిణీ చేయనున్నారు.

నేరుగా ప్రభుత్వ రాయితీలు..

అతివృష్టి, అనావృష్టి సమయాల్లో కౌలుకోలేని దెబ్బ తగులుతోంది. దీంతో చాలా మంది కౌలు రైతులు అప్పుల ఊబిలోకి పోతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు మూడు విడతల్లో రూ. 6 వేలు అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 7500 కలిపి వైఎస్సార్ రైతు భరోసా కింద మొత్తం రూ. 13,500 చెల్లిస్తోంది. భూ యజమాని హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా 11 నెలల కాల పరిమితిలో పంటసాగు చేస్తున్న కౌలు రైతు కార్డు పనిచేసేలా ప్రభుత్వ చర్యలు తీసుకుంది. అలాగే విపత్తుల సమయంలో జరిగిన పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ సైతం ఇచ్చి అదుకుటోంది, అంతేకాకుండా కనీస మద్దతు ధర, రాయితీ విత్తనాలు పొందే అవకాశం కల్పించింది.

జిల్లాలో కౌలు కార్డులు


రెవిన్యూ డివిజన్	టార్గెట్	అచీవ్‌మెంట్
కడప	2211	1779
పులివెందుల	702	704
జమ్మలమడుగు	2485	3012
బద్వేల్	1637	1558

కౌలు రైతులకు కార్డులు అందించాం



కౌలు రైతులకు కార్డులను అందించాం. వీటి వల్ల భూ యజమానికి ఎలాంటి ఇబ్బంది కలగదు. ఈ కార్డుకు కేవలం 11 నెలల మాత్రమే కాలపరిమితి ఉంటుంది. సాగు హక్కు తప్ప భూమిపై కౌలు రైతుకు ఎలాంటి హక్కు ఉండదు. ప్రస్తుతం రైతు భరోసా కింద జిల్లాలో 1792 మంది కౌలు రైతులకు 1,32,52, 500 నగదు నేడు వారి ఖాతాల్లో జమకానుంది. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

వైఎస్ఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం



వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న భట్టి విక్రమార్క

వేంపల్లె: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని తెలంగాణ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాజశేఖరరెడ్డి సమాధికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే ఉన్న వైఎస్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నమస్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రారంభం నుంచి చివరి వరకు పాల్గొన్న తమ వ్యక్తి గత సిబ్బంది వివిధ భాగాల్లో సేవలు అందించిన నాయకులు అందరూ దివంగత నేత వైఎస్ఆర్ ఆశీస్సులు తీసుకోవాలని భావించి ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. వైఎస్ఆర్ హయాంలో తాను శాసనమండలిలో సభ్యుడిగా, శాసన సభలో చీఫ్‌విప్‌గా పనిచేసినట్లు చెప్పారు.అంతేకాకుండా వైఎస్ఆర్‌కు తాను చాలా సన్నిహితంగా ఉండేవాడినన్నారు. ఆయనకు ప్రజా అభివృద్ధిపైన ఉన్న తపన ఎవ్వరికీ ఉండదన్నారు. ఆయన మరణం మనందరి దురదృష్టకరమని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, ఏఐసీసీ మెంబర్ ధ్రువకుమార్‌రెడ్డి, డీసీసీ మాజీ ప్రెసిడెంట్ నజీర్ అహమ్మద్, మాజీ సిటీ ప్రెసిడెంట్ బండి జకరయ్య, ఏఐసీసీ వైస్‌ప్రెసిడెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గండిలోకి వాహనాలకు అనుమతి లేదు

చక్రాయపేట : శ్రావణ మాసం మూడవ శని వారం నాడు వాహనాలను గండిలోకి ఎట్టిపరి స్థితిలోనూ అనుమతించమని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. గండిలో ఆయన విలేక రులతో మాట్లాడుతూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు, ట్రాక్టర్లు అన్నింటిని గండి ఆవరణంలోకి అనుమతించమని చెప్పారు. రాయచోటివైపు నుంచి వచ్చే వాహనాలు అద్దా లమర్రి క్రాస్ వద్దనే ఆపేస్తామన్నారు. వేంపల్లె వైపు నుంచి వచ్చే వాహనాలను వీరన్నగట్టు పల్లె వద్ద ఆపుతామని చెప్పారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం వరకు ఈ ఆం క్షలు అమలులో ఉంటాయన్నారు.

సివిల్ సర్వీసెస్ హాకీ జట్టుకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా హాకీ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో జిల్లాకు చెందిన పలువురు ఉద్యో గులు చక్కటి ప్రతిభ కనబరిచారు. హాకీ క్రీడాం శంలో ప్రవీణ్‌కిరణ్ (పీడీ, చెమ్ముమియాపేట జెడ్పీ హైస్కూల్), ఎస్. గౌస్‌బాషా (డిజిటల్ అసిస్టెంట్, చెన్నూరు), జి. ఉదయ్ దీప్ (డిజిటల్ అసిస్టెంట్, సిద్ధవటం), యు. శివ (ఎడ్యుకేషన్ సెక్రటరీ, నకాష్, కడప)లు ఎం పికయ్యారు. వీరు సెప్టెంబర్ 8వ తేదీన విజ యవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి సివిల్‌సర్వీ సెస్ ఉద్యోగుల ఎంపికల్లో పాల్గొననున్నారు. వీరిని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్, హాకీ కోచ్ కల్యాణ్, శ్రీనివాసరాజు అభినందించారు.

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇరువురికి జైలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ విధులకు ఆటం కం కలిగించిన కేసులో ఇరువురికి ప్రొద్దుటూరు కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఇత్తడి శ్రీనివాసులు మున్సిపల్ 2వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. 2018 మార్చి 3న విధి నిర్వహణలో భాగంగా రాత్రి 9 గంటల సమయంలో ఆంధ్రకేసరి రోడ్డులోని పెద్ద గుంత వద్ద పందులను పట్టు కొని తరలిస్తుండగా వివేకానంద కాలనీకి చెం దిన కాసారపు చిన్న వెంకటసుబ్బయ్య, అతని అమ్మ రమణమ్మలు అక్కడికి వెళ్లారు. పందు లను పట్టకుండా విధులకు అడ్డుపడి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వాళ్లు బెదిరించారు. ఈ మేరకు అతను ఫిర్యాదు చేయడంతో టూ టౌన్ పోలీ సులు వారిపై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ముధుమల్లేశ్వరరెడ్డి ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపించారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో ఏజేఎఫ్‌సీఎం కోర్టు చిన్న వెంకటసుబ్బయ్య, రమణమ్మలకు గురు వారం ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధించింది. తగు సాక్ష్యాధారాలతో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేసిన టూ టౌన్ సీఐ జి. ఇబ్రహీం, కోర్టు కానిస్టేబుళ్లు విజ యరామరాజు, పెరుగు సుబ్బరాయుడులను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న స్కార్పియో
- భార్యాభర్తలు దుర్మరణం
- కుమారునికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వలీ, రమీజా, చికిత్స పొందుతున్న బాల కుల్లాయప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురం రింగురోడ్డు సమీపంలో శ్రీకృష్ణదే వాలయం వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని స్కార్పియో ఢీకొన్న సంఘటనలో భార్యాభర్తలు దుర్మరణం చెందగా వారి కుమారునికి తీవ్ర గాయా లయ్యాయి. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పులివెందుల మండల పరి ధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో ఉన్న ఉప్పరాం పల్లె గ్రామానికి చెందిన వలీ, రమీజాలకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్న కుమారుడైన బాలకుల్లా యప్పకు కడుపునొప్పి రావడంతో చికిత్స కోసం పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి ద్విచక్రవా హనంలో బయలుదేరారు. భాకరాపురం శ్రీకృష్ణ దేవాలయం రింగురోడ్డు వద్దకు రాగానే కడప నుంచి సింహాద్రిపురం వెళ్తున్న స్కార్పియో ఢీకొంది. ఈ సం ఘటనలో ఊడవగండ్ల వలీ (42), ఆయన భార్య రమీజా (38) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రం గా గాయపడిన బాలకుల్లాయప్పను చికిత్స కోసం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనం తరం పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆసు పత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పరాంపల్లెలో విషాద ఛాయలు..

ఉప్పరాంపల్లె గ్రామానికి చెందిన వలీ, రమీజాలు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాఖీ పౌర్ణమి రోజు ఇంటి దగ్గర ఆనందంగా గడిపిన ఆ ఇంట ఒక్కసారిగా విషాదం అలుముకుంది. దంపతులు మృతిచెందడంతో బం ధువులు, గ్రామస్తులు బోరున విలపించారు.

వలీ కుటుంబానికి అండగా ఉంటాం..

ఉప్పరాంపల్లె గ్రామానికి చెందిన వలీ, ఆయన భార్య రమీజా మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎ స్సార్‌సీపీ నాయకులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్‌లు ఆసుపత్రి వద్దకు చేరుకుని మృతదేహాలను సందర్శించారు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జీసీసీపీఎల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన



వీడియో ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు, వైద్య సిబ్బంది

కమలాపురం : యువత మాదక ద్రవ్యాలకు దూరం గా ఉండాలని అప్పుడే క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పల్లాకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఆ కళాశాలలో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా సీఎస్ఆర్ హెడ్ పేర్ల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యం లో విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిలర్ సుధ, స్టాఫ్ నర్స్ చిన్న సుబ్బమ్మ క్యాన్సర్‌కు సంబంధించిన వీడియో లను ప్రత్యక్షంగా చూపిస్తూ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ బారిన పడకుం డా సలహాలు, సూచనలు, జాగ్రత్తలు తెలియజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడితే క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమిస్తాయ న్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా క్యాన్సర్‌ను ముందే గుర్తించవచ్చన్నారు. ధూమపానం, మద్యపానం, పొగాకు నమలడం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంద న్నారు. ఎన్ఎస్ఎస్ సీనియర్ ఆఫీసర్ అయ్యవారు, అశోక్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అని, వ్యాధి బారిన పడి ఆలోచించడం కంటే ఆ వ్యాధులకు దూరంగా ఉండటం ఎంతో మంచి దన్నారు. చెడు వ్యసనాలు అలవాటు చేసుకునే ముందు ఒక్క సారి మీ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షోలాపూర్ వాసి నందలూరులో మృతి



యువకుడి మృతదేహం

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రం లోని మొదటి ప్లాట్‌ఫాంపై గురువారం షోలాపూర్‌కు చెందిన మహేష్ (25) కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ కింద ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. రిజర్వేషన్ బోగీ డోర్ వద్ద నిలబడి ఉన్న తరుణంలో ప్రమాదానికి గురయ్యాడు. అది కూడా స్టేషన్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్ చికిత్స చేశారు. 108లో తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలిచారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు ముగ్గురు స్నేహితులతో కలిసి కొల్హాపూర్ రైలులో తిరుపతికి బయలు దేరాడు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్...

పీలేరురూరల్ : అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరసింహుడు కథనం మేరకు.. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన కె. సుధాకర్ (37) కుమార్తె నందిని కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం కుమార్తెను పాఠశాలలో వది లేందుకు తన ఆటోలో కోటపల్లెకు వెళ్లాడు. స్కూల్ వద్ద కుమార్తెను దించాడు. పాఠశాల బయట ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటో వద్దకు వెళ్లి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు తీసుకెళ్లాలని కోరారు. ఓ వ్యక్తి ఆటో ఎక్కాడు. ఆటోలో వెనుక నుంచి ఏదో సూదితో గుచ్చినట్లు అనిపించడంతో డ్రైవర్ వెనుకకు తిరిగి చూశాడు. అంతలోనే ఆటోలోని వ్యక్తి పారిపోయాడు. కొంత సేపటికి సుధాకర్ సం ఘటన స్థలంలో కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని స్థానికులు పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి వీపుపై సూదితో గుచ్చిన గుర్తులు పోలీసులు గుర్తించారు.

లారీ ఢీ కొని..

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయరహదారిలో ఊటుకూరు (రాజంపేట మండ లం) వద్ద బుధ వారం రాత్రి లారీ ఢీ కొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు.

భార్యపై భర్త హత్యాయత్నం



భర్త దాడిలో కత్తిపోట్లకు గురై సంఘటన స్థలంలో తీవ్ర రక్తస్రావంతో స్పృహతప్పి పడిపోయిన లక్ష్మీదేవి



లక్ష్మీదేవి (ఫైల్), దాడికి పాల్పడ్డ నిందితుడు రఘు

మదనపల్లె : భార్యపై భర్త మచ్చుకత్తితో నడిరోడ్డులో వెంటబడి విచక్షణారహితంగా దాడి చేసి హత్యా యత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మద నపల్లె పట్టణంలో జరిగింది. మండలంలోని సీటీఎం పంచాయతీ చిలకలవారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి (53), ఆమె భర్త రఘు గత కొన్ని సంవత్సరాలుగా మదనపల్లె రెడ్డప్పనాయుడు కాలనీలో నివాసముం టూ, తోపుడు బండిపై ఇద్దరూ పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఈ క్రమంలో రఘు మద్యానికి బానిసై పండ్ల వ్యాపారం సక్రమంగా చేయకుండా, వ్యాపా రంలోని నగదును దుర్వ్యసనాలకు ఖర్చు చేస్తూ జులాయిగా మారాడు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. ఇటీవల కుమారుడు బాలాజీపై దాడి చేసి గాయపరచగా పోలీసు స్టేష న్‌లో ఫిర్యాదు సైతం చేశారు. గొడవల కారణంగా లక్ష్మీదేవి భర్తకు దూరంగా తాము నివాసమున్న ప్రాంతంలో బంధువుల ఇంటిలో ఉంటోంది. గురు వారం తెల్లవారుజామున ఆమె వ్యాపార నిమిత్తం ఇంటి నుంచి బయటకు రాగానే రఘు ఆమెతో గొడవకు దిగాడు. ఆమె అతనినుంచి తప్పించుకుని వెళుతుండగా మచ్చుకత్తితో ఆమెను వెంటబడి బాపూజీ పార్కు వద్ద నడిరోడ్డులో విచక్షణారహితం గా దాడి చేశాడు. దాడిలో లక్ష్మీదేవి తల, చేతులు, వీపుపై తీవ్ర గాయాలై సంఘటన స్థలంలో తీవ్ర రక్త స్రావంతో స్పృహతప్పి పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందిం చి బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలిం చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరు గైన వైద్యం కోసం స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. కాగా దాడికి పాల్పడ్డ నిందితుడిని పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు.

'రాఖీ' కట్టించుకుని వస్తుండగా..

- లారీ ఢీకొని..
- తల్లి దుర్మరణం, కుమారుడికి తీవ్రగాయాలు



కృష్ణవేణి (ఫైల్)



కడప రిమ్స్ మార్చురీలో కృష్ణవేణి మృతదేహం



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తేజకుమార్ (5)

కడప అర్బన్ : అన్నాచెల్లెలి అనుబంధానికి ప్రతీకగా.. రాఖీని పౌర్ణమి రోజున రాఖీ కట్టించేందుకు తన కుమారులను, తన బావ కుమార్తె వద్దకు పిలుచుకుని వచ్చింది. రాఖీని తన కుమారులిద్దరికీ కట్టించింది. ఎంతో ఆనందంగా గడిపారు. ఆ ఆనందం కొన్ని నిమిషాల్లోనే ఆవిరై పోయింది. రోడ్డు ప్రమాదం రూపంలో మహిళ నిం డు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఈ సంఘటనపై కడప రిమ్స్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఒంటిమిట్ట మం డలం చెంచుగారిపల్లెకు చెందిన చిన్నయ్యగార్ల కృష్ణ వేణి(29), తన కుమారులు తేజకుమార్ (5), మరో కుమారుడు (3)తో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త లక్ష్మీనరసయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కృష్ణవేణి బావ కుమార్తె లోకిత(12) కడప చిన్నచౌక్ బాలికల గురు కుల పాఠశాలలో చదువుతోంది. ఈ క్రమంలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా లోకితతో, తన కుమారులు ఇద్దరికి రాఖీలను కట్టించాలని, తన తోడికోడలుతో పాటు, కుమారులను పిలు చుకుని గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. లోకిత తన బాబాయి కుమారులైన ఇద్దరికి రాఖీ కట్టింది. తరువాత కృష్ణవేణితో పాటు, కుమారులు, తోడికో డలు బయటకు వచ్చి రోడ్డు దాటుకుంటుండగా, భాకరాపేట వైపు నుంచి వేగంగా లారీ వచ్చి ఢీకొం ది. ఈ ప్రమాదంలో కృష్ణవేణి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన తేజకుమార్‌ను రిమ్స్‌కు తీసుకెళ్లారు. తరువాత మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఈ సంఘ టనపై కడప రిమ్స్ ఔట్ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టే బుల్ సుధాకర్, రిమ్స్ పోలీసు స్టేషన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తోడికోడలు రాజేశ్వరి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు.

కువైటీ వేధింపుల నుంచి మహిళకు విముక్తి

చొరవ చూపిన ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు



మహబూబ్ జానీకు ఔట్ పాస్‌పోర్టు, టికెట్ అందిస్తున్న ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యుడు

కడప కార్పొరేషన్ : ఎడారి దేశమైన కువైట్‌లో సేఠ్ వేధింపులకు గురవుతున్న మహిళకు మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు విముక్తి కల్పించారు. వివరాలిలా ఉన్నాయి.. అన్న మయ్య జిల్లా మదనపల్లికి చెందిన షేక్ మహబూబ్ జాన్ అనే మహిళ ఆరుమాసాల క్రితం జీవనోపాధి కోసం హౌస్ మెయిడ్(ఇంటి పని) నిమిత్తం కువై ట్‌కు వెళ్లింది. కువైటీ(సేఠ్) ఇంట్లో విశ్రాంతి ఇవ్వ కుండా అర్ధరాత్రి వరకూ పనులు చేయించడంతో ఆమె అనారోగ్యానికి గురైంది. సేఠ్ ఆమెను ఆసుప త్రిలో చూపించకుండా పని ఎగ్గొట్టేందుకు నాట కాలు ఆడుతున్నావని గదిలో పెట్టి బంధించాడు. తాను పడుతున్న బాధలను ఆమె ఎలాగోలా ఇం డియాలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపిం ది. వారు ఎమ్మెల్యే నవాజ్ బాషాను కలిసి తమ కుమార్తె చనిపోయే పరిస్థితిలో ఉంది, ఎలాగైనా ఇం డియాకు రప్పించాలని ప్రాధేయపడ్డారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏపీఎన్ఆర్‌టీఎస్ ఛైర్మెన్ మేడ పాటి వెంకట్, డైరెక్టర్ ఇలియాస్‌ల దృష్టికి తీసుకు పోయారు. వారు భారత రాయబార అధికారులకు వివరాలను మెయిల్ చేసి మహబూబ్ జాన్‌ను ఇండి యాకు పంపే ఏర్పాట్లు చేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం బాలిరెడ్డి ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి సేఠ్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. దీంతో మహబూబ్ జాన్‌ను ఇంటి నుంచి భారత ఎంబసీ వద్దకు తీసుకుపోయి భోజన వసతి, సౌకర్యాలు కలి ్పంచారు. ఆమెకు పాస్‌పోర్టు లేనందున ఔట్ పాస్‌పోర్టు తయారు చేయించి, టికెట్ ఖర్చులు కూడా ఆయనే భరించారు. 31వ తేది అర్ధరాత్రి 2.20 గంటలకు ఆమె ఇండియాకు బయలుదేరింది. ఈ సందర్భంగా మహబూబ్ జాన్ మాట్లాడుతూ తాను సజీవంగా తమ తల్లిదండ్రులను కలుస్తానని కలలో కూడా అనుకోలేదన్నారు. ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రులకు సేవలు చేస్తున్న ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

దేశానికి మంచి రోజులు రాబోతున్నాయి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రొద్దుటూరు క్రైం : దేశానికి మంచి రోజులు రాబోతున్నాయని, ప్రజలందరూ ధైర్యంగా ఉం డాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సీపీఐ బస్సుయాత్ర ప్రొద్దుటూరుకు చేరిన సం దర్భంగా గురువారం శివాలయం సెంటర్‌లో నిర్వ హించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ వామపక్ష పార్టీలకు ఎం పీలు తగ్గిపోవడం వల్ల కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాది పార్టీ, ఆర్జేడీ తదితర 26 రాజకీయ పార్టీలన్నీ ఒక వేదిక పైకి వచ్చినట్లు తెలిపారు. అం దరూ ధైర్యంగా పోరాడి కేంద్రంలో నరేంద్రమోడి, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలను గద్దెదించాలన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో బస్సుయాత్ర చేప ట్టామని తెలిపారు. 9 ఏళ్ల మోడీ పాలనలో కులాలు, మతాల మధ్య కుమ్ములాటలు పెరిగిపోయాయ న్నారు. దేశంలో ధరల నియంత్రణ లేదని, ఎన్నికల సమయం కావడంతో వంట గ్యాస్‌పై రూ.200 తగ్గించారన్నారు. అనంతరం సుందరయ్య కాల నీలో రామకృష్ణ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఓబులేసు, జి.ఈశ్వ రయ్య,జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, దుర్గాభవాని, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అవమానంతోనే యువకుడి ఆత్మహత్య



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు : అమృతానగర్‌కు చెందిన యువకుడు అబ్దుల్ అవమానంతోనే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారా యణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతనెల 7న రాత్రి 9 గంటలకు అబ్దుల్ ఆత్మహత్య చేసుకు న్నాడన్నారు. ఐదుగురు కలిసి అబ్దుల్‌పై దాడి చేశార ని, అందులో ఒకరు చేతికి ఉన్న కడియం తీసుకుని ఛాతిపై గుద్దారన్నారు. ఆ నొప్పికి తాళలేక యువ కుడు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడని చెప్పారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేయకుండా మరు సటి రోజు ఉదయం రావాలని చెప్పారన్నారు. ఈ అవమానాన్ని భరించలేక యువకుడు రైలు కింద పడి మరణించాడన్నారు. తమ కుమారుడు పోలీ సులకు ఫిర్యాదు చేసినప్పుడే పోలీసులు స్పందించి ఉంటే తమ బిడ్డ బతికేవాడని యువకుడి తల్లి పేర్కొందన్నారు. అయితే ఇప్పటికీ పోలీసులు దాడికి పాల్పడిన వారిని స్టేషన్‌కు పిలిపించలేదని తెలిపారు. ఇటీవలి కాలంలో అమృతానగర్‌లో అల్లరి మూకల చేష్టలు పెరిగిపోయాయన్నారు. పోలీసులు కట్టడి చేయకుంటే రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. సమా వేశంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముం తాజ్ బేగం, పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బయ్య తది తరులు పాల్గొన్నారు.

జంతువుల కోసం గాలింపు



మొక్క జొన్న పొలంలోకి వెళుతున్న రైతులు, గ్రామస్తులు

రాజుపాళెం : గత నాలుగు రోజుల క్రితం మండలం లోని వెంగళాయపల్లె గ్రామంలో రైతు జగన్నాథరెడ్డి పొలంలో దాగి ఉన్న జంతువుల కోసం రైతులు, పలువురు గ్రామస్తులు గురువారం సాయంత్రం గాలించారు. అందరూ ఒక్క సారిగా కట్టెలు, గొడ్డళ్లు చేతపట్టుకుని పటాకులు పేల్చుకుంటూ పొలంలో కేకలు వేస్తూ వెళ్లారు. అయితే చివరకు మొక్క జొన్న పొలంలో నుంచి ఎలాంటి జంతువు రాకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ మొక్క జొన్న పంటలో చిరుత పులి దాగి ఉందన్న అనుమానం గ్రామస్తుల్లో ఉండటంతో ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తుందోనని గత నాలుగైదు రోజులుగా భయాందో ళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ముద్దనూరు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వచ్చి మొక్కజొన్న పొలం చుట్టూ పరిశీలించారు. లోపలికి వెళితే ఏదైనా ప్రమాదం జరుగుతుందని, పొలం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంత వరకు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు, గ్రామస్తులు ధైర్యం చేసి పొలమంతా కలియ తిరిగారు.

2 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ సత్యనారాయణ

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో 2 కిలోల గం జాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు నిం దితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. గురువారం స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు వివ రాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మదనపల్లె డివిజన్‌లో గంజాయి విని యోగం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అందులో భాగంగా తాలూకా పోలీసులకు అందిన సమాచారం మేరకు గతనెల 31వతేదీ గురువారం మండలంలోని తట్టివారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద మదనపల్లె పట్టణం చంద్రాకాలనీకి చెందిన పూల సంతోష్ అలియాస్ సంతూ (30), పట్టణంలోని మంజునాథకాలనీకి చెందిన అంకిశెట్టిపల్లి శివ(30) ఇద్దరు నిందితులను అదుపు తీసుకుని వారి వద్ద నుంచి రూ.20 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై ఎన్‌డీపీసీ యాక్టు మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు. గంజాయి కేసుల్లో నిందితులైన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న స్కూల్‌బస్సు



తీవ్రంగా గాయపడిన కవిత, ఆటో డ్రైవర్ వాసుదేవ, సయ్యద్‌సాహెబ్ అలియాస్ బాబు

మదనపల్లె : స్కూల్ బస్సు ఆటోను ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకి పురం నుంచి ప్యాసింజర్లతో కూడిన ఆటో మదనపల్లెకు వస్తుండగా శానిటోరియం సమీపం లోని తురకపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేటు స్కూల్ బస్సు ఆటోను ఢీకొంది. ప్రమాదం లో ఆటో డ్రైవర్ వాసుదేవ(37), మదనపల్లె మండలం తట్టివారిపల్లెకు చెందిన కవిత(48), వాల్మీకిపురం పట్టణానికి చెందిన సయ్యద్‌సాహెబ్ అలియాస్ బాబు (50) తీవ్రంగా గాయ పడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కవిత, వాసుదేవ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

కడప అర్బన్ : కడప నగరం కొత్త కలెక్టరేట్ సమీపంలోని మహావీర్ సర్కిల్ సమీప ప్రాం తంలో భిక్షాటన చేసుకుని జీవించే వృద్ధురాలు మృతి చెందింది. అనారోగ్యంతో బాధప డుతున్న ఆమెను గత నెల 28న రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గత నెల 30వ తేదీ రాత్రి రిమ్స్‌లోనే మృతి చెందింది. ఆమె చేతులపై పచ్చబొట్లు ఉన్నాయి. మృతదే హాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి

■ గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులలో ఉచిత వసతి తో కూడిన శిక్షణ సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు. Nihar skill Education, Kadapa. సంప్ర: 9063082227. [C-1220224]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-2045]

SERVICE

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్నా సూచనలు ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ :9041115088 [HA-30327]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6913]

CHANGE OF NAME

■ I, SHAIK ABDUL REHAMAN R/o 26/914-1-1, NAGENDRANAGAR, PRODDATUR, KADAPA DIST., AP. NOW I CHANGE MY NAME AS SANDALMMA, GARI SHAIK ABDUL REHMAN S/o. SHAIK KHAJAPEER (NEW NAME). [C-777219]

WANTED

■ తేజ టైల్స్ & శానిటరివేర్ షోరూం ప్రొద్దుటూరు /కడప బ్రాంచ్‌ల నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. సంప్ర॥ 8074374696. [C-777214]

■ C.K.Plywood షాపు నందు పనిచేయుటకు Tally నందు అనుభవం కల్గిన అకౌంటెంట్, కస్టమర్స్ నందు అనుభవం గల సూపర్‌వైజర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ప్రొద్దుటూరు. లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర: 9440490804. [C-777216]

■ సెంటర్ ఇంఛార్జ్ కావలెను: ఆశ్రమ్ ఆకృతి హియరింగ్ క్లినిక్ మరియు థెరపి సెంటర్‌లో పనిచేయుటకు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్త్రీ (లేదా) పురుషులు అభ్యర్థులు కావలెను. ద్వారకానగర్, కడప. సంప్ర॥ 9000111148, 9133034222. [C-777023]

■ SSC, Inter, డిగ్రీ, ITI Diploma, పా/ఫెయిల్ అయ్యి ఖాళీగా ఉన్న 39 మంది స్త్రీ/పు.ల మా సంస్థలో పనిచేయుటకు కావలెను జీ:14000+DA6000 + ఫ్రీ రూమ్ ఎటువంటి ఫీజు లేదు. చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. 9502400350. [A-7406]

■ రెయిన్‌బో కంపెనీలో బుక్స్ మార్కెటింగ్ చేయుటకు కావలెను. 10th, Inter, పాస్/ఫెయిల్. కమీషన్ ఇవ్వబడును, 2 వీలర్ కంపల్సరీ, ఫోన్ : 9398981980 [H-189478]

■ నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రీడన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 9441018078, 6301341831. [A-7302]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసు కోవడానికి M/Fఆయా,నర్సులు, వంటచేయు వా రు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 12000-35000/ -,ఫ్రీరూమ్+భోజనం.Hyd.ఫోన్ :7995984445. [HA-564]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

